రచన - సెప్టెంబరు 2003

# మనసు మర్కటం

ఆలోచనలకి అనేకమైన కారణాలుంటాయి. కారణం లేదా సమస్య తీవ్రతను బట్టి ఆలోచనలనేవి మహాదారుణమైన మార్గాల్లో చెలరేగుతాయి. అవి మనసుని చిత్రహింసలు పెడ్తాయి. అప్పుడప్పుడు సిగ్గుపడేటట్లు చేస్తాయి. స్వార్థపరమూ, శృంగారపరమూ అయిన ఆలోచనలు వ్యక్తుల్నీ, బంధుత్వాల్నీ సహితం లెక్కచెయ్యవు. సంఘమనే ఓ కట్టుబాటూ, నీతీ నియమమూ అనే ఓ వ్యక్తిగతమైన నమ్మకమూ ఆలోచనలని ఆచరణలో పెట్టడానికి అడ్డొస్తాయి కాని, విశృంఖలంగా విజృంభించిన ఆలోచనలని అరికట్టడానికి కొంతవరకే పనికొస్తాయి. మంచైనా, చెడైనా ఆలోచనలకి కార్యరూపం యివ్వడానికి కొండంత ధైర్యముండాలి.

అంతకు పదిహేను రోజుల క్రితమే మరో ప్రాంతం నుంచి బదిలీ అయి వచ్చిన సీనియర్ సైంటిస్ట్ విమల్, కంపెనీ పరిశోధనాలయంలో పన్జేస్తున్న సుజాతను ఆ రోజు మరోసారి స్పృశించాడు. మొదటి రెండుసార్లూ ఏదో యాదృచ్ఛికం అని సరిపెట్టుకున్న సుజాత ఈసారలా సరిపెట్టుకోలేకపోయింది. మాటల్లో పొగడ్తలూ, దృక్కుల్లో తృష్ణా అతని ఆంతర్యాన్ని తెలియజేస్తున్నాయి.

అప్పటికి పరిశోధనావస్థలో ఉన్న కొత్త మందుల తాలూకు వివరాలు తెలుసుకొనే మిషతో, కనీసం రోజుకు రెండుమార్లైనా తన ఛాంబర్‌కి పిలుస్తున్నాడు. మరో రెండుసార్లు తనే సుజాత బల్ల దగ్గరకు వెడ్తున్నాడు. సహోద్యోగులు కనుబొమ్మలెగరవేయడం గమనించిన సుజాత ఇబ్బందిపడసాగింది. విషయాన్ని బేరీజు వేసుకోసాగింది.

సుజాతకి తన అందం సంగతి తెలుసు, భార్యగా, తల్లిగా, ఓ ఉద్యోగినిగా బాధ్యతలు తెలుసు. భర్త ప్రశాంత్‌ది మంచి ఉద్యోగం. కంపెనీ వ్యవహారాల నిమిత్తమై నెలలో సగంపైగా ప్రయాణాలు చేస్తుంటాడు. తననీ, పాపనీ చక్కగా చూసుకొంటాడు. తమకి చక్కటి ఇల్లుంది, కారుంది, తనకి పూర్తి స్వాతంత్ర్యముంది. అయినా యాంత్రికంగా గడిపే జీవితం మనసులో కదలాడసాగింది. టూర్ల మీద వెళ్ళినప్పుడు తప్పదు కాని, ఊళ్ళో ఉన్నప్పుడు కూడా ప్రశాంత్ పెందరాళే ఇంటికి రావడమనేది అరుదు.

విమల్ స్ఫురద్రూపి, సమవయస్కుడు. తనంటే వ్యామోహంలో పడ్డట్టు అతని ప్రవర్తన ఋజువు చేస్తోంది. అతని ఈ బలహీనతని తను వాడుకొంటే? ఆశలు చూపించి బెల్లిపిస్తూ, నైపుణ్యంగా తప్పించుకొంటూ కొంతవరకే పై మెట్లెక్కవచ్చునేమో కాని, నైతికంగా సంపూర్ణ పతనానికి సిద్ధపడితే ఉద్యోగంలో ఎదగడానికి అవకాశాలు చాలా హెచ్చు. ఈ మార్గాన్ననుసరిస్తే తాత్కాలికంగా పొందే లాభాలు ఉండొచ్చు, ఎల్ల కాలమూ అధికారుల మన్ననా పొందవచ్చు. కాని, పర దారా వ్యామోహం తీరిన మనిషి చిరకాలమూ అధిరోహించే సోపాన మార్గాలు

చూస్తాడని ఎక్కడుంది? పరపతిపోయి, ఎక్కిన మెట్టు నుంచి దిగజారి నవ్వులపాలయ్యే ప్రమాదం పొంచిచూస్తూనే ఉంటుంది.

ఇటువంటి ఆలోచనలు చెలరేగినందుకు తిట్టుకొంది. సిగ్గు పడింది. ఆలోచనలలో చోటు చేసుకొన్న విమల్‌ని బయటకు నెట్టడానికి ప్రయత్నిస్తున్నా కుదరటల్లేదు. సమస్యకు మూలకారణమైన విమల్ వేధింపుల నుంచి బయటపడడానికి మార్గం ఆలోచిస్తున్నప్పుడు, మనసు ఈ విధంగా కూడా పరుగెత్తుతోంది. పరిష్కారమేమిటి? అధికార వర్గానికి తెలియ జెయ్యడం, లేదా నలుగురెదుటా బుద్ధి చెప్పి మందలించడం. ఏ మార్గం అనుసరించినా తను అపహాస్యం కాక మానదు. కనుబొమలెగరవేసే మనుష్యులు కావ్యాలల్లుతారు!

మరి మార్గాంతరం? ఉద్యోగానికి తిలోదకాలిచ్చేసి ఇంటిపట్టున కూర్చోవడమే. వివాహానికి ముందే ఉద్యోగం దొరికింది. పెళ్ళిచూపుల్లో ఆ విషయమై ప్రసక్తి వచ్చింది. ప్రశాంత్ ఏ విధమైన అభ్యంతరమూ చెప్పలేదు సరికాదా, "నాదా, ప్రస్తుతానికి టూర్ల మీద పోయే ఉద్యోగం. ఇంట్లో గోళ్ళు గిల్లుకొంటూ కూర్చుంటే మీకూ ఏం తోస్తుందని? చదివిన చదువు సార్థకత పొందాలంటే ఉద్యోగం ఓ సాధనం కదా?" అని పైపెచ్చు ప్రోత్సహించాడు.

తన తల్లిదండ్రులు ఉన్న వారు కారు. ఉద్యోగం చేసి తమని ఆదుకొంటుందని కొండంత ఆశతో కష్టపడి చదువు చెప్పించినా, సమాజపు కట్టుబాట్లకి లొంగి, ఆశల్ని నిస్వార్థంగా అణచివేసుకొని, తనని మరో గడపలోకి పంపి వివాహమనే వ్యవస్థ పట్ల తమ బాధ్యత తీర్చుకొన్నారు. అయితే ప్రశాంత్ మరోమారు తన ఔన్నత్యాన్ని చాటుకొన్నాడు.

"నిన్ను ఉద్యోగం చెయ్యమనడం నీ సంపాదన కాశించి కాదు! వచ్చిన జీతమంతా నా చేతిలో పెట్టాలని శాసించి, నీ కన్నవారి బ్రతుకుతెరువుకు అడ్డొచ్చే దుర్మార్గుణ్ణి కాను! ఆ విషయమై నిశ్చింతగా ఉండు."

తనిప్పుడు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తే? హైస్కూల్లో చదువుతోన్న ఇద్దరు తమ్ముళ్ళూ, కాలేజీలో మొదటి సంవత్సరం ఎం.ఏ. చదువుతోన్న చెల్లెలూ, ఎప్పుడో రిటైరయిపోయినా నామమాత్రంగా వస్తున్న పించను తప్ప మరే ఇతర విధమైన సంపాదనా లేని తండ్రీ, అన్నింటికీ దైవం మీద భారం వేసి గాలిలో దీపం పెట్టే తల్లీ మనసులో మెదిలారు. ఉద్యోగం మానలేని పరిస్థితి, తనిప్పుడేం చేయాలి?

అస్తవ్యస్తమైన ఆలోచనలతో సతమతమవుతున్న సుజాత దగ్గరకు జేరి ఒడిలోకి ఎక్కబోయిన పాప మీద కసురుకుంది. పాప ఏడుపు లంకించుకొంది. అప్పుడే లోపలకి అడుగు పెట్టిన ప్రశాంత్‌కి సోఫాలో పరధ్యానంగా కూర్చున్న సుజాతా, కాళ్ళ దగ్గర కూర్చుని ఏడుస్తున్న పాపా కంటబడ్డారు. ప్రశాంత్ వెంటనే వెళ్ళి పాపని ఎత్తుకోవడంతో, ఏడుపు నాపి తండ్రి జేబులో చాక్లెట్ కోసం తడమసాగింది.

"పాప శోకరాగాలు తీస్తోంటే తమరేవో ఊహాగానాల్లో తేలిపోతున్నట్లున్నారు?!" అన్నాడు ప్రశాంత్, సుజాత భుజం మీద తడ్తూ.

"అది మీ కోసం, మీరు తెచ్చే చాక్లెట్ల కోసం ఏడుస్తుండడం అలవాటే కదా!" అంది సుజాత లేని నవ్వు తెచ్చుకొంటూ.

"పాప చాక్లెట్ల కోసం ఏడవడం, నేనింటికి ఆలస్యంగా రావడం రెండూ మామూలే కాని, తమరి పరధ్యానం సంగతి గురించి చెప్పలేదు!" అన్నాడు ప్రశాంత్, జేబులోంచి చాక్లెట్ తీసి పాపకిస్తూ.

ఆఫీసులో ఎదుర్కొంటున్న వేధింపుల గురించి భర్తకి చెప్పాలని ఆ క్షణంలో ఓ నిశ్చయానికి వచ్చేసింది సుజాత.

"మీరు స్నానం చేసి బట్టలు మార్చుకొనిరండి, మీకో ముఖ్యమైన విషయం చెప్పాలి," అంది ప్రశాంత్ చేతుల్లోంచి పాప నందుకొంటూ.

ప్రశాంత్ స్నానం చేసి వచ్చేసరికి సుజాత పాపని నిద్రబుచ్చి, డైనింగ్ టేబుల్ మీద అన్నీ అమర్చింది.

"మన కుటుంబంలోకి కొత్త సభ్యుడు కాని వస్తున్నాడా ఏమిటి?!" అని ప్రశాంత్ నవ్వుతూ ప్రశ్నించాడు.

"సభ్యుడూ కాదు, సభ్యురాలూ కాదు! కొత్తగా బదిలీ అయి వచ్చిన ఓ సీనియర్ ఆఫీసరు నన్ను వేధించడం మొదలు పెట్టాడు!" - ఉపోద్ఘాతం లేకుండా సుజాత సూటిగా చెప్పిన మాటలు విని, ప్రశాంత్ ఒక్కసారిగా తొట్రుపడ్డాడు.

"వివరంగా చెప్పు," అన్నాడు కుర్చీ మీద కూర్చుంటూ.

సుజాతకి కొండంత ధైర్యం వచ్చింది. కొత్తగా వచ్చిన విమల్ ప్రవర్తన గురించి నెమ్మది నెమ్మదిగా, వివరంగా చెప్పింది.

అంతా విన్న ప్రశాంత్, "అంటే మన జీవితంలోకి విమలుడనే ఓ విలన్ ప్రవేశించాడన్న మాట!" అన్నాడు హాయిగా నవ్వుతూ.

"నేనింత సీరియస్ విషయాన్ని చెబ్తే, దాన్ని మీరు తేలిగ్గా తీసిపారేస్తున్నారు?" అంది సుజాత రోషంగా. సుజాత హావభావాల్ని గమనించి ప్రశాంత్ సమస్య గంభీరమైనదే అనుకొన్నాడు.

"చూడు సుజాతా! ఇతరుల చేత గుర్తింపబడాలన్న తపన స్త్రీల అంతర్యంలో ఉంటుందనుకొంటాను. అందుకని తామెంత అందంగా ఉన్నా మరింత ఆకర్షణీయంగా కనబడ్డానికి ప్రయాసలు పడ్తారు. మంచి దుస్తుల వైపూ, అలంకరణ వైపూ మొగ్గుచూపుతారు. ఈవ్ టీజింగ్ అనేది పురుషుల మనోవికారమైనా, స్త్రీల అందానికదో గీటురాయనుకొంటాను. విమల్ ప్రవర్తనలా ఉండడానికి నువ్వేనేమో కారణం!" - ఉద్రిక్తతను తగ్గించే ప్రయత్నంలో అన్నాడు ప్రశాంత్.

"మా ఆఫీసులో చాలామంది పురుషులున్నారు. ఎవరూ అలా ప్రవర్తించ లేదు!"

"వాళ్ళందరి మనస్సులో నీ గురించి ఎటువంటి ఆలోచనలున్నాయో చెప్పడం కష్టం. ఎటొచ్చీ వాళ్ళు చెయ్యలేని ధైర్యాన్ని విమల్ చేస్తున్నాడేమో?"

"అంటే, విమల్ ప్రవర్తనని మీరు సమర్థిస్తున్నట్లే కదా?!" సుజాత ఆశ్చర్యపోతూ అడిగింది.

"అతని ప్రవర్తన మంచిదని నేను చెప్పట్లేదుకాని, కారణం మట్టుకు నీ అందం అతగాడిని నిస్సహాయుణ్ణి చెయ్యడమే అంటున్నాను!"

"మీకీ విషయాన్ని చెప్పింది వేదాంతాన్ని వినడానికి కాదు, సమస్యకు పరిష్కార మార్గం సూచిస్తారని!" – ఆమె గొంతులో విసుగు ధ్వనించింది.

"అందరూ ఏమనుకొంటారో అన్న భయం వదిలి, చెప్పగలిగితే పై అధికారులకి చెప్పు. లేదా చెప్పు తీసుకొని చెంప వాయించు! ఈమాటు పక్కకి వచ్చి పలకరింపులు చేసి, వెకిలివేషాలు వేస్తే టెస్ట్‌ట్యూబ్‌లోని యాసిడ్‌ని మొహాన్న వేసి బుద్ధి చెప్పు! పర్యవసానం ఏమవుతుందో చెప్పలేను. అతను అధికారవర్గం వారికి దగ్గరివాడైతే నీ ఉద్యోగం పోవచ్చు! కాని పక్షంలో మందలించి వదిలేయవచ్చు. అతణ్ణో, నిన్నో మరోచోటుకి బదిలీ చెయ్యవచ్చు. ఏది ఏమైనా మీఇద్దరి పేర్లూ నలుగురి నోళ్ళలోనూ నాలుగు కాలాలపాటు నానడం తథ్యం! కాదంటావూ, సహనంతో భరించి, నేర్పుగా నీ జాగ్రత్తలో నువ్వుండు" అన్నాడు ప్రశాంత్, అసాధ్యం కాకపోయినా కష్టతరమైన ఆచరణ మార్గాలు సూచిస్తూ.

"ఉద్యోగానికి రాజీనామా చేసేస్తే?" సుజాత అడగకూడదనుకొంటూనే అడిగేసింది.

"నీ తమ్ముళ్ళిద్దరూ చేతికందొచ్చేవరకూ, నీ చెల్లెలి పట్ల మీవారి బాధ్యతలు తీరేవరకూ, నీ పుట్టినింటి భారాన్ని పూర్తిగా నేనే మోయవలసివస్తుంది. దానికి అభ్యంతరం లేదు కాని, నా ఒక్కడి జీతంతో వేర్వేరు ఊళ్ళలో రెండు సంసారాల్ని పోషించడం కష్టం. కలిసి ఉంటే ఖర్చు కలిసి వస్తుంది. వాళ్ళని వచ్చి ఇక్కడే మనతోపాటు ఉండమను. ఈ విషయమై ఇక ఆలోచించి మనసు పాడుచేసుకోకు. నీ నిర్ణయం ఏదైనా సమర్థిస్తాను" – ప్రశాంత్ అతి సులువుగా అన్న మాటలు సుజాత గుండె బరువును తగ్గించాయి.

మరుసటి రోజు ఉదయం ప్రశాంత్ ఆఫీసు పని కారణంగా, ఢిల్లీకి ప్రయాణమై వెళ్ళాడు. సుజాత ఆఫీసుకి సెలవు పెట్టి, పాపతో సహా ఓ రెండు గంటలు బస్సు ప్రయాణం చేసి తన తల్లిదండ్రులున్న ఊరు చేరుకొంది. అసలు కారణం చెప్పకుండా, పాప పెంపకంలో ఉన్న సాధకబాధకాల దృష్ట్యా, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చే ఉద్దేశ్యంతో ఉన్నట్టూ, ప్రశాంత్ వాళ్ళ కుటుంబాన్ని గట్టెక్కేవరకూ ఆదుకోడానికి సిద్ధంగా ఉన్నట్టూ చెప్పింది.

"ఇప్పటికే, పెళ్ళయిన ఆడపిల్ల సంపాదనతో బ్రతుకుతూ సిగ్గుపడి కుమిలిపోతున్నాం. ఇక పూర్తిగా అల్లుడి మీద ఆధారపడి జీవించడం మరీ దుర్భరంగా ఉంటుంది. నీ పాప భవిష్యత్తు నువ్వు చూసుకో. మా పాట్లేవో మేము పడతాం," అని సుజాత తండ్రి ఆ విషయాన్ని అక్కడే త్రుంచేసి, తన నిర్ణయాన్ని దృఢంగా తెలియజేశాడు.

బస్‌స్టాండ్ వరకూ దిగబెట్టడానికి వచ్చిన చెల్లెలు వసంత అక్క సుజాతతో అంది.

"అక్కా! నాన్నగారి నిర్ణయం మంచిదే అయింది. భవిష్యత్తుని గురించి భయపడి, మీ ఇంటికి మకాం మార్చడానికి ఎక్కడ ఒప్పేసుకొంటారేమోనని భయపడిపోయాను. ఎందుకంటే... ఎందుకంటే బావగారివి ఆకలి చూపులు! మీరిద్దరూ అప్పుడప్పుడూ వచ్చిన సందర్భాల్లో

వీలుదొరికినప్పుడల్లా, ఆ వంకా, ఈ వంకా పెట్టి తాకడానికి ప్రయత్నించాడు. ద్వంద్వార్థపు మాటలు ప్రయోగించాడు. మరదలితో సరసం అనే దానికి భాష్యమేమిటో, హద్దులేమిటో నాకు తెలియవు కాని, బావగారి ప్రవర్తన అసభ్యంగా ఉందనిపించింది. నువ్వు ఉద్యోగానికి రాజీనామా చేస్తాననడంతో, మీ ఆశ్రయంలోకి మమ్మల్ని తీసుకుపోవడానికి చూపిన సంసిద్ధత బావగారి అంతర్యాన్ని తెలియజేస్తోంది! నేనీ సంగతి ఎవరితోనూ చెప్పలేదు. చెప్పకూడదనుకొంటూనే నీకు చెప్పేశాను. బావగారితో ఈ విషయమై ప్రస్తావించకు. నీ జీవితం సంగతి నువ్వు చూసుకో. మా గురించి బెంగపడకు. ట్యూషన్లు చెప్పి నాలుగు రాళ్ళు సంపాదించుకోనే అవకాశం నాకుంది."

నీళ్ళు నిండిన కళ్ళతో, బరువెక్కిన హృదయంతో తిరుగు ప్రయాణం చేసి ఇల్లు చేరుకొంది సుజాత. ఇప్పుడు సుజాతలో ఓ విధమైన నిర్లిప్తత ఆవహించింది. ఆ మర్నాడు సాదా నూలుచీర కట్టుకొని, నుదుట పెద్దబొట్టు పెట్టుకొని, పాపిట్లో కుంకం దిద్దుకొని ఆఫీసుకి వెళ్ళింది.

"ఈ రోజు మీరు చాలా అద్భుతంగా కనబడ్తున్నారు!" అన్నాడు. విమల్ మెచ్చుకోలుగా.

ఇప్పుడు సుజాతకి విమల్ మీద ద్వేషం కలగలేదు.

"మా ఆయన టూర్ మీద ఢిల్లీ వెళ్ళారు. ఈ సాయంత్రం మా ఇంటికి 'టీ'కి రండి," అని సుజాత అప్రయత్నంగా ఆహ్వానించింది.

ఇంటికి చేరగానే పాప ఆయాని పంపించేసింది. ఆ తర్వాత మనసులో ఘర్షణ పడ్తానేఉంది.

కాలింగ్‌బెల్ చప్పుడు విని, భయాందోళనావృతమైన మనసుతో, తడబడ్తున్న అడుగులతో వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా విమల్. పక్కనే ఓ మూడేళ్ళ బాబు నెత్తుకొన్న యువతి. తనంత అందగత్తె కాకపోయినా ఆకర్షణీయంగా ఉంది.

"సుజాతగారూ, ఈమె నా శ్రీమతి అనూరాధ! మా బాబు పంకజ్" – విమల్ పరిచయం చేశాడు.

భర్త ప్రశాంత్ అంతర్యాన్ని యాదృచ్ఛికంగా వసంత ద్వారా తెలుసుకొన్న సుజాత, విమల్ అంతర్యమేమిటో అర్థంకాక విస్తుపోతూ, ఇద్దర్నీ లోపలికి ఆహ్వానించింది.

తను బురదలో అడుగు వెయ్యకుండా అపద్బాంధవిలా విమల్‌తో కూడా వచ్చిన అతని భార్య అనూరాధకి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకొంది. భార్యను కూడా తీసుకువెళ్ళడం మంచిదే అయిందని విమల్ కూడా అనుకోకపోలేదు.

అయితే, భర్త ఇంటలేని సమయంలో పర్యవసానాలు అంతగా ఆలోచించకుండా విమల్‌ని ఇంటికి ఆహ్వానించి, తను అతనికి లోకువ అయిపోయిందా అన్న ఆలోచన సుజాతనీ, సుజాత తననో 'కాసనోవా' కింద జమకట్టేసిందేమోనన్న ఆలోచన విమల్‌ని చాలా ఇబ్బంది పెట్టాయి.

✿ ✿ ✿

"విమల్ 'ది విలన్' ఏమంటున్నాడు?" అన్నాడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన ప్రశాంత్.

"దంపతులిద్దరూ వచ్చి మనల్నిద్దర్నీ వాళ్ళ ఇంటికి ఆహ్వానించారు!" అంది, సుజాత కళ్ళింతగా చేసుకొని.

"అలాగా?!" అన్నాడు ప్రశాంత్ నవ్వుతూ.

ఆ నవ్వు వెనుక నీరసాన్నీ, నిరుత్సాహాన్నీ గమనించకపోలేదు సుజాత. ✿